# చీకటి తప్పు

మొదటిరాత్రి పడకగదిని చూసి భాస్కరం నవ్వుకున్నాడు. బాధగా.

గాలి రాదు. భరింపరాని వుక్క. దుర్భరంగా వుంది. యీ మూడంకనాల గదిలో వేరుసెనక్కాయ మూటలు, పత్తి, వ్యవసాయ సామాగ్రి, దుంచుబండలమీద కుండల దొంతరలు, ట్రంకులు, డబ్బాలు, తమకు వేసిన మంచం, ప్రక్కనే బీరువా, పైగా యిన్నింటిని చూస్తూ, సహిస్తూ, యిలవేల్పు!! యీ గదే వాళ్ళ సంసార సర్వస్వం.

చీకటి తప్పు అంటే బహుశా యిట్లాంటి గుహలోనే చేసేది కాబోలు. దీన్ని గది అనటం కంటే గుహ అనటమే బాగుంది. తాను కూడా యీ గదిలో జంతువు కావాలి. పోనీ జంతువులాగా ప్రవర్తించాలి. యింతకుముందు ముక్కు ముఖం యెరుగని ఆడ జంతువుతో పడుకోవాలి. ఆడజంతువు! యెంత అసహ్యంగా వుంది యీ పదం! తాళికట్టిన భార్యనా ఆడజంతువు అనటం? యిట్లా అనటం అసహ్యం! మరి యిష్టంలేని పెళ్ళి చేసుకొనటం అంతకంటే అసహ్యం!! డబ్బు

కోసమే యిష్టంలేని పెళ్ళి చేసుకొనటం పరమ అసహ్యం!!! మరి యిట్లాంటి గుహలో ఆపని చేయటం అంతకంటే........!?

యిది వ్యభిచారం. నలుగురు వొప్పుకున్న వ్యభిచారం. కాని ఈ పద్ధతి తప్పు అని యెవరితో యెట్లా చెప్పటం? యెవరు వింటారు చెప్పినా? మేమంతా చేస్తూండగా నీకేం తెగులు? హాయిగా చేసుకో రాదా అంటారు. ఛీ. వీళ్ళంతా మనుషులు కారు. తానుకూడా........

యీ కిరసనాయిలుబుడ్డి పొగ వొకటి. యింకొక లాంతర్ని కొనుక్కుంటే యేం? మామగారింట్లో వొకే వొక లాంతరు. సేద్య గాడు పగలు పగలగొట్టినాడు. రాత్రి మామ సేద్యగాన్ని తిడు తున్నాడు.

తన డిగ్రీ. మధ్యతరగతి పేదరికం. మనస్సూ. అన్నీ - సర్వస్వం - అమ్ముడు పోయినాయి. మామ కొనుక్కున్నాడు - పది వేలిచ్చి. పిల్లనిచ్చి. అమ్ముడుపోవటం - కొనుక్కోవటం. జీవితా లతో వ్యాపారం! ఘనమైన వ్యాపారం!! సిగ్గు పడకుండా గర్వంతో చేసే వ్యాపారం! తనప్పుడు మానసికమైన ఘర్షణ పడినాడా? బాధ పడినాడా? బాధపడలేదేమో-ఘర్షణ మాత్రం పడినాడు. సంకీర్ణమైన ఘర్షణ. కానీ దానికొక రూపం అంటూలేదు.

పెళ్ళినాటికి జీవితంమీద-అందులోనూ వైవాహిక జీవితం మీద-తన కేఆశలూ లేవనే అనుకోవాలి. మనిషికి వున్న ఆశలూ ఆదర్శాలూ యేవైనా ఫలిస్తేనే కదా వాటికి జీవితంలో విలువ వుండ టం. అర్థం వుండటం? ఫలించని ఆశలూ ఆదర్శాలూ వున్నా లేనట్లే. అందుకే తనకవిలేవు. జీవితంలో యేం యెదురొచ్చినా

నిర్లిప్తంగా అనుభవించాలనుకున్నాడు. కాకపోతే చేసేది యేముంది? తానీవిధంగా మారటానికి కారణభూతమైన సాంఘిక శక్తుల్ని తాను వ్యక్తిగతంగా యెదుర్కొంటాడా? యిప్పట్లో వ్యక్తిగతమైన ఘర్షణకు, తిరుగుబాటుకు ప్రయోజనంలేదు. వొకవేళ ఘర్షణ పడినా తిరుగుబాటు చేసినా, అది వొక యింపొటెంట్ రేజ్! అందుకే పిల్ల బాగలేదన్నా వొప్పుకొన్నాడు తను. మామ పాతచింతపండు మొదలుకొని తోటలోని గోగాకు వరకు వ్యాపారంచేసి సంపాయిస్తున్న నీచుడన్నా, పది రూపాయలకు రూపాయి వడ్డీతో డబ్బు మూటగట్టుతున్న పాపిష్టి వాడన్నా వొప్పుకున్నాడు. యిప్పట్లో నీచులే యెంతో డబ్బు సంపాదిస్తారు. మోసగాళ్ళూ, పాపిష్టివాళ్ళే డబ్బు మూటగట్టగలరు. అందుకే మామకంత డబ్బు వుంది.

తమకు డబ్బులేదు, అప్పులూ, మధ్యతరగతి దర్పంతప్ప, పెళ్ళి కావలసిన చెల్లెండ్లు తప్ప, దిన దినానికి కరగిపోయే ఆస్తిని పంచుకోవడానికి వున్న నలుగురు సోదరులు తప్ప; తమ దరిద్రాన్ని పెంచే సారహీనమైన భూములు తప్ప! అప్పుల్తో నాన్న బాధపడుతూంటే తాను చూల్లేకపోయినాడు. నీకు పెళ్ళిచేసి ఆ వచ్చే డబ్బుతో అప్పులు తీరుస్తానంటే బాధపడినాడు, రెండిటికి సమన్వయం కుదరదు. కుటుంబంతోటి తన మానసికమైన బంధాన్ని తెంచుకోలేకపోయినాడు, బాధపడుతూ నీచంగా నీచులతో సంబంధం చేసికొన్నాడు. కొన్నివేలు వూరిక వచ్చినాయి! డబ్బుకోసమేనా యీ పెళ్ళి? డబ్బుకోసమే! డబ్బు యీ దేశంలో, యీ సంఘంలో, అన్నింటిని శాసిస్తోంది. ఆలోచించటం మొదలుపెడితే తెగదు, యెంతకూ తెగని బాధ తప్పదు.

పెళ్ళికి ముందు తానుకూడా ప్రేమించినవాడే. తన మధ్యతర గతి మనస్సు వొక నిర్ణయం చేసుకొనే వేళకే వసంత పెళ్ళయి పోయింది. రెండు మూడేండ్లు యేవోసాకులుచెప్పి పెళ్ళి చేసుకో కుండా తప్పించుకున్నాడు. యిట్లాంటి పెళ్ళినించి తప్పించుకొనటం అంటే బాధనించి తప్పించుకొనటం. ప్రేమించే శక్తి తనలో నశించి పోయింది. అయితే పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం యెన్ని విధాలో వుంది. పెద్దలు నిర్ణయించేపెళ్ళి. స్నేహంలేని పెళ్ళి. ప్రేమలేనిపెళ్ళి. డబ్బుకోసమే పెళ్ళి తప్పక చేసుకోవలసి వచ్చింది.

ప్రవాహంలాగా వస్తున్న యీ ఆలోచనలను; తల పగిలే యీ ఆలోచనలను. భరించలేకపోతున్నాడు భాస్కరం.

దంతెల్లోంచి మట్టిబెట్ట రాలింది. తలుపుదగ్గిర చప్పుడయింది. అటువైపు చూసినాడు భాస్కరం యేదో ఆతురతతో. రెండు మూడెలుకలు పరిగెత్తినాయి.

తన భార్య అనే మనిషి వస్తే బాగుండు. తన భార్య అం దంగా వుండదు. అందంగా కన్పించడానికి ప్రయత్నించదు. కట్టూ బొట్టూ తెలియదు. కాకపోతే వంటినిండా ఆ సొమ్ములేమిటి? ఖరీదైన చీరెల్ని గుళ్ళో నాంచారమ్మలా కట్టుకొంటుందేమిటి? నగరాల్లో యెంతమంది అందం లేనివాళ్ళు అందంగా కన్పిస్తారు! ఆ విధంగా కన్పించటానికి యెన్ని ప్రయత్నాలు చేస్తారు! ఆకర్షవంతంగా నైనా కన్పించకూడదా? తెలీదేమో! అందమైన సరుకుకాదు కాబట్టే అన్ని వేలతో తనకు దొరికింది! అయినా యిలాంటివాళ్ళే పెండ్లాలకు అర్హు లేమో! యిట్లా అనుకున్నందుకు యెంతో బాధపడినాడు భాస్కరం.

ముహూర్తం ముగిసిన తర్వాత జీవితాన్ని గూర్చిన చిక్కు ఆలోచనలను భరించలేక సిగరెట్టు కాల్చుకుంటూ శూన్యంలోకి చూస్తున్నాడు తాను, అర్థ రహితంగా. శ్రీనివాసులువచ్చి 'యిట్లాంటి కొంపలో యిట్లాంటి పిల్లనెందుకు చేసుకొన్నావురా? లోకంలో యింకెవ్వరూ లేరా?' అన్నాడు బాధతో. తాను సమాధానించకుండా నవ్వినాడు. వాడికి కోపంవచ్చి 'యెప్పుడూ యింతే - నీ పనులకు తలా తోకా వుండదు', అంటూ వెళ్ళిపోయినాడు కోపంగా. యిట్లాంటి కొంప అయినందువల్లనే యిన్నివేలిచ్చినారు. యిట్లాంటి పిల్ల అయినందునే యిన్నివేలు తెచ్చింది. అందమైన వాళ్ళెప్పుడూ యిన్నివేలతో మధ్యతరగతి వాళ్ళదగ్గరికిరారు. వొకవేళ పొరపాటున వచ్చినా వాళ్ళ అందం చాలాకాలం నిలవదు. బిడ్డల్ని కనేవేళకే ఘోరంగా తయారవుతారు. మధ్యతరగతి వాళ్ళకి దండిగా డబ్బు కావాలంటే దొరికేది యెందుకూ పనికిరానివాళ్ళు; వొక్క పెళ్లికి తప్ప; వంట చేయటానికీ, పిల్లల్ని కనటానికీ తప్ప. యేమిటి తనింత ఘోరంగా ఆలోచిస్తున్నాడు? తను చేసే పనులకు తలా తోకా వుండదు. జీవితంలో వొక నిర్దిష్ట దృక్పథం అంటూ లేనినాడు యెవరుచేసే పనులకైనా తలా తోకా వుండదు.

తన భార్యపేరు! పేరుకూడా అందంగా వుండదు. వెంకటమ్మ! లోకంలో యింకేంపేరూ లేదా? వాళ్ళనాన్న అభిరుచికీ, సంస్కారానికీ వెంకటమ్మ బాధ్యురాలు కాదు. పాపం! మొదట పెళ్ళిపత్రికలు వేయించేటప్పుడు పేరు మార్పిస్తామనుకొన్నాడు. మామ వొప్పుకోలేదు. తను బలవంతము చేయలేదు.

మళ్ళీ తలుపుదగ్గిర చప్పుడయింది. అనుకోకుండా గుండెదడ హెచ్చింది. నిజంగానే యిప్పుడు తలుపుదగ్గిర నిలబడివుంది వెంక టమ్మ. నాలుగైదు నిముషాలు గడిచినా లోనికి రాలేదు.

యెట్లా పిలవాలో తనకు తెలియదు. యేం పరిచయం లేకుం డానే యెట్లా పిలవటం? పెళ్ళితోనే వద్దన్నా తీరని బంధం చుట్టు కొందికదా! కడకు "రా" అని పిలిచినాడు భాస్కరం. సాధ్యమైనంత మృదుత్వం కంఠంలో ధ్వనించేటట్లు.

మెల్లిగా లోనికి వచ్చింది ఆమె. వచ్చి మంచముదగ్గర నిల బడుకొంది. తలవంచుకొని. కూచోకుండా.

"సిగ్గా?" స్త్రీలతో యెట్లా మాట్లాడాలో తెలియని భాస్కరం సిగ్గా అంటూ ప్రశ్న వేసినాడు. రసికుడిలా. తర్వాత యేం చేయాలో తోచలేదు. అప్రయత్నంగా చేయిపట్టుకొని కూచోపెట్టినాడు. స్త్రీ స్పర్శ యీ విధంగా భాస్కరం యెన్నడూ యెరుగడు. వెంకటమ్మ శరీరంలోని వేడిమి తీక్షణతకు తట్టుకోలేక పోయినాడు భాస్కరం.

మనసుకు క్రమంగా యేదో మైకం కమ్ముతోంది. యేవేవో ఆలోచనలు. పాశవికమైన ఆలోచనలు. రాక్షసమైన ఆలోచనలు. యేదో పెలితి. మరేదో వేదన. మరెక్కడో కాంక్ష. భాస్కరం లోని ప్రాకృతికమైన శక్తులు యెదురుచూస్తున్నాయి యిపుడు.

"వుక్కగా వుందికదూ?" భాస్కరం ప్రశ్నకు "వూఁ" అంది వెంకటమ్మ. "మాట్లాడితే ముత్యాలు రాల్తాయా?" ప్రశ్నించిన తర్వాత తన ప్రశ్న తనకే వెగటుగా తోచింది భాస్కరానికి. నిజానికి

ముత్యాలు రాలవుకదా. మరి యిట్లాంటి తెలివితక్కువ ప్రశ్నలు యెందుకు వేస్తారో అనుకున్నాడు భాస్కరం.

"యీగది నానా ఛండాలంగా వుంది. మిద్దిమీదికి పోయినా హాయిగా వుండేది. యిట్లాంటి గదిలో నా కసహ్యం. ప్రేమా. మోహం యీ యిరుకులో వికసించవు. గాలి. వెలుతురు అవసరం వాటి వికాసానికి. వెం........'' పేరు పలకబోయి మధ్యలోనే ఆపివేసినాడు భాస్కరం. వసంత పేరు జ్ఞాపకానికి వచ్చింది.

తనేనా యిట్లా మాట్లాడేది? ఆశ్చర్యం కలుగుతోంది. పోనీ తను ప్రేమిస్తున్నట్లు నటిస్తే యేం? యిట్లా యెందరు నటించలేదు? దాంతో పాపం తాను బాధపడదు, తన్ను బాధపెట్టదు. కొంతవరకైనా తన అభిరుచులకు అనుగుణంగా మార్చుకొంటే! భాస్కరం ఆలోచిస్తూ అప్రయత్నంగా అన్నాడు: "చూడు పెళ్ళంటే గుదిబండ కట్టుకొనటంకాదు. వొకర్నొకరు అర్థం చేసుకోవాలి''

ఛీ. తనమీద తనకే అసహ్యం వేస్తోంది. యింత కృత్రిమంగా మాట్లాడడం తానెప్పుడు నేర్చుకొన్నాడు....? మంచినీళ్ళు అడిగినాడు భాస్కరం దిక్కుతోచక. మంచినీళ్లిచ్చింది వెంకటమ్మ. యేం మాట్లాడకుండా గడ గడా మంచినీళ్ళు త్రాగుతోంటే ఆమె మెడకున్న నగలు కన్పించాయి, భాస్కరానికి.

''అవన్నీ తీసెయ్. నాకు చాలా అసహ్యం - వళ్ళునిండా అవివుంటే. సాదా దుస్తుల్లోనే యెంతో అందంగా కన్పించవచ్చు."

ఆమె సమాధానించలేదు. నగలూ తీయలేదు.

"అవి వుంచుకోవటం నీ కిష్టమేనన్నమాట. అయితే నీ యిష్టం." అని నిట్టూర్చినాడు. యేదీ బలవంతంతో సాధించటానికి పూనుకోని భాస్కరం.

చుట్టూ వున్న వాతావరణం, వెంకటమ్మ మూగతనం, యెడ తెగని తన ఆలోచనలు-అన్నీ విసుగును, కోపాన్ని, బాధని తెప్పిస్తు న్నాయి. వొకరకంగా అర్థంకాని ద్వేషం పగ రగలుతున్నాయి. యెవరిమీదో తెలియదు. బహుశా వెంకటమ్మ మీదా? వాళ్ళ నాన్న మీదా? తన నాన్నమీదా? మధ్యతరగతిమీదా? వసంతమీదా? సంఘం మీదా? తన నిస్సహాయత్వంమీద?! భాస్కరం యింతవరకు మంచం పట్టెమీద కూచొనివున్న భార్యనుచూపి "పడుకో" అన్నాడు. పడు కొంది వెంకటమ్మ. "యిటు తిరుగు".

అటు తిరిగే పడుకొంది.

భాస్కరం పూర్తిగా పురుషుడైనాడు. అజ్ఞాత వాంఛలు మేల్కొన్నాయి. "బుడ్డి వుంచనా"? భాస్కరం ప్రశ్నకు వెంకటమ్మ పలక్కపోయేసరికి విసుగ్గా ఆ గుడ్డిదీపాన్ని ఆర్పివేసినాడు. గదినిండా చీకటి. ఆ చిక్కటి చీకటిలో, ఆ వుద్రేకంలో, ఆ వాంఛా ప్రవా హంలో, ఆ విచక్షణా రాహిత్యంలో, ఆ మృగత్వంలో, తన ప్రశ్నలకు, ప్రేరణలకు, జవాబులు రాకున్నా, అసహ్యంవేస్తున్నా శరీరపు వాంఛల్ని తీర్చుకుంటూ, మైమరచి "వసంతా" అన్నాడు భాస్కరం. పొరపాటు తెలుసుకొని నిస్తేజుడయినాడు....

చలన రహితంగావున్న వెంకటమ్మనుచూసి, యీ రాతిమనిషి నా తాను అనుభవించటం? కర్కశంగా, క్రూరంగా - యుద్ధం రోజుల్లో

యెక్కడో పొరపాటున వొక ఆడది దొరికితే యెందరో సైనికులు కసిదీరా మొరటుగా అనుభవిస్తూ చంపి. చచ్చినా ఆశవాన్ని అనుభవించినట్లు - అనుకున్నాడు భాస్కరం.

మనిషిలో యిప్పటికీ పశువులకంటె హీనంగా కోర్కెల్ని తీర్చుకునే గుణం వుందా? తన విజ్ఞానం, వున్నతాదర్శాలు యేమయినాయి? వొక్కసారి దుమ్ములో కలిసిపోయినాయి. జీవితంలో తన కలలు కూలిపోయినాయి, యిక ప్రయోజనం లేదు. ప్రేమల్ని, యిష్టానిష్టాల్ని అధిగమించే మృగత్వాన్ని శాసించలేక పోయినాడు. వసంతని మాత్రమే హృదయంలో పదిలపరచుకొన్న తాను; యే సంస్కారమూ లేని, తన కిష్టంలేని వెంకటమ్మను అనుభవించ గలడు, కేవలం శరీరం ఆదేశిస్తే.

తానూ యిక సంసారి అయినాడు. యిట్లాంటి పెండ్లితో రాజీ పడినాడు. తానూ యిక చీకటి తప్పులు యిష్టమున్నా లేకపోయినా చేస్తూనే పోతాడు, పిల్లల్ని కంటాడు. దేశజనాభా పెంచుతాడు, దేశ దరిద్రాన్ని పెంచుతాడు. యేసుఖమూ, యే వున్నతాదర్శమూ లేకుండా మామూలుచావు చస్తాడు, తానూ పతితుడైనాడు. యిక జీవితాంతం కుమిలి చావవలసిందే. తానెందుకిట్లా అవుతున్నాడు? యీ విధమైన మానసిక సంక్షోభాన్ని జీవితాంతం అనుభవించటం కంటే నాన్నకు యెదురుతిరిగినా బాగుండేది. యీ పెండ్లి చేసుకోకుండినా బాగుండేది. సుఖాన్ని చెరపట్టినా బాగుండేది. యీరోజుల్లో సుఖం కావాలంటే కసిదీరా సుఖాన్ని చెరపట్టాలి, యీ పరిసరాల్ని విడిచి తలుపుతీసి పారిపోతే బాగుండు....ఛీ! బయట గొళ్ళెం పెట్టినారు, యీ హాస్యా

నికి మాత్రం లోటులేదు. బుద్ధయినా ముట్టిస్తే బాగుండు. కానీ చీకట్లో యిందాక చేసిన పని!? ఆ మనిషి ప్రక్కన వెల్తుర్లో తనను చూసుకునే ధైర్యం తనకు లేదు. తనకిక వేరేగతి లేదు. భవిష్యత్తు అంతా అయోమయంగా వుంది. తనెట్లా జీవించ బోతున్నాడో తనకు తెలియదు.

తనమీద యెవరైనా సానుభూతి చూపిస్తే బాగుండు. తన్నెవరైనా వోదారిస్తే బాగుండు. తనను గాఢంగా ప్రేమించే వాళ్ళెవళ్ళ వొళ్ళోనన్నా తలవుంచి యేడుస్తే బాగుండు. పోనీ. తన తల యిట్లానే యీ క్షణంలో వేయి ముక్కలైతే బాగుండు. వేయి ముక్కలైతే మనసంటూ ఆలోచించటానికి వుండదు. ఆలోచించ కుంటే బాధ వుండదు. వేయి ముక్కలైతే. తాను చస్తే తన భార్య గతి? పాపం! యిట్లాంటి తనను కట్టుకొని యేం సుఖపడుతుంది? తనమీద. తన భార్యమీద జాలి కలిగింది భాస్కరానికి ఆనిముషంలో.

యీ వేదనని వినేవారెవరు? జీవితంలో తనని భరించగల వొకే వొక వసంత యెవరి బాధల్నో. శరీరాన్నో భరిస్తోంది. తాను తన భార్యని భరించాలి. తప్పదు. యెన్నో భరించాలి, యిష్టమున్నా లేకపోయినా. భాస్కరం కళ్ళలో అప్రయత్నంగా కన్నీటి చారలు కదిలాయి. యే కడజాము వేళకో మగతనిద్ర పట్టింది. ఆ మగత నిద్రలో భాస్కరానికి వొక కల వచ్చింది.

భాస్కరం యేదో నీడని వెంటాడుతూ పరుగెత్తుతున్నాడు. శ్మశానం చేరేవేళకి ఆ నీడ మాయమైంది. శూన్యంలోకి. యెవరో మనుషులు మంగళ వాద్యాలతో డబ్బుని. యెంతకూ తరగని డబ్బుని

పెదజల్లుతూ వొక శవాన్ని తెచ్చినారు. వాళ్ళందరూ నవ్వుతున్నారు. తనెందుకో యేడుస్తూ ఆశవాన్ని అనుభవిస్తున్నాడు! చుట్టూ రాక్షసుల్లాంటి పిల్లలు....

భాస్కరం భయంతో పలవరిస్తూ ఆ మగత నిద్రలోనే భార్యను గట్టిగా కౌగలించుకున్నాడు.

భాస్కరం మానసిక నిమ్నోన్నతాలు తెలియని ఆమె అమాయికంగా, మూడంకెలో గాఢమైన నిద్రలో చిరునవ్వు నవ్వుకొంటోంది. ఆక్షణంలో తనేదో సాధించినట్లు- జీవితంలో తన బంగారు కలలేవో ఫలించినట్లు - తను యెదురుచూస్తున్న ముహూర్తం వచ్చినట్లు!!

"సవ్యసాచి" : 13 అక్టోబరు 1963